క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన కార్యక్రమంలో 11 మంది విద్యార్థులు పాల్గొని పుస్తక పఠనం, కథలు చెప్పడం చేశారు. గ్రంథాలయాధికారి అప్పల నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ సందర్శనను అలవాటుగా చేసుకోవాలన్నారు. గ్రంథాలయాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంటున్నాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేజీబీవీలో అదనపు భవన నిర్మాణాలకు శంకుస్థాపన



కోటవురట్లలోని కేజీబీవీలో శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి అనిత

కోటవురట్ల: స్థానిక కేజీబీవీలో అదనపు భవన నిర్మాణాలకు హోం మంత్రి అనిత మంగళవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తోందని, ఇందులో భాగంగానే రూ.1.68 కోట్లతో అదనపు భవనాలను నిర్మిస్తున్నట్టు ఆమె తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.అనిల్‌కుమార్, టీడీపీ జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో యలమంచిలి విద్యార్థుల ప్రతిభ



కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

యలమంచిలి రూరల్: ఏపీ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4న విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కరాటే పోటీల్లో యలమంచిలి కరాటే స్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. నలుగురు విద్యార్థులు కశింకోట శ్రీను, కె.హాసిని, ఎస్.కె.ఆఫ్రిన్, ఈ.రాకేష్ బంగారు పతకాలు, 8 మంది విద్యార్థులు ఎం.మనోజ్ కుమార్, కె.హేమశ్రీ చంద్రిక, కె.హాసిని, బి.జ్యోతిష్, ఎస్.కె.ఆయేషా, ఐ.ప్రీతమ్, కె.కార్తీక్, ఈ.సాహితి వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. మరో 9 మంది విద్యార్థులు బ్రాంజ్ మెడల్స్ పొందారు. విజేతలను మంగళవారం సాయంత్రం స్థానిక కరాటే స్కూల్‌లో అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ నక్కా వెంకటరమణ, శిక్షకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగాసనాలపై అవగాహన



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం: వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. యోగా ప్రాధాన్యత వివరిస్తూ, విద్యార్థులతో ఆసనాలు వేసే విధానంపై తర్ఫీదు ఇప్పించారు. వేసవిలో విద్యా పరమైన అంశాలతో పాటు, క్రమ శిక్షణ, శారీరక దారుఢ్యాన్ని మెరుగుపరచుకోవడంపై అవగాహన కల్పిస్తున్నామని లైబ్రేరియన్ కోటేశ్వరరావు తెలిపారు.

మోదకొండమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న మోహన్

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో మోదకొండమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా మంగళవారం మునగపాకకు చెందిన విల్లూరి భాస్కరరావు కుమారుడు మోహన్ దంపతులు రూ.5వేల విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

వేసవి నేస్తాలు.. తాటి ముంజలు



తాటి ముంజలు



తాటి ముంజలు తీస్తున్న గీత కార్మికుడు

- వేసవిలో రెండు నెలల పాటు తాటి ముంజలకు గిరాకీ
- పొలాలకు వెళ్లి సరదాగా యువత ఆరగింత
- ఆరోగ్యంతో పాటు ఎన్నో ప్రయోజనాలు

కోటవురట్ల:

ప్రకృతి ప్రసాదించిన వర ప్రసాదాలు ఎన్నో మనిషి మనుగడలో భాగమై మధురానుభూతిని కలిగిస్తుంటాయి. సీజనల్‌గా వచ్చే కాయ, పండ్లు మనిషికి తోడుగా ఆరోగ్య ప్రదాయినిగా సంతృప్తినిస్తాయి. మూడు కాలాల్లో ఆరోగ్యాన్ని ప్రసాదించే ఎన్నో ప్రకృతి ఫలాలు మన ముందున్నాయి. వేసవి వస్తే మండే ఎండలే గుర్తుకొస్తాయి. కానీ ఆ వెంటే ఆహ్లాదాన్ని ఇచ్చే ఎన్నో ఫలాలు మన వెన్నుంటాయి. అవి ఎన్ని తరాలు మారినా, ఆధునికత పెరిగినా మనకు తోడుగానే ఉంటాయి. వేసవిలో ఎండ వేడి నుంచి, ఉష్ణ తాపం నుంచి తప్పించుకుని సేదతీరేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. వాటిలో తాటి ముంజలు ముందుంటాయి. ఈ పేరు వింటే చాలు ఎవరికైనా నోరూరక మానదు. వేసవిలో పిల్లలకు సెలవులు రావడానికే ముందుగానే తాటి ముంజలు అందుబాటులోకి వస్తాయి. ఇక ఊళ్లకు వెళ్లగానే సరదా సరదాగా పొలాలకు వెళ్లి తాటికాయలు కొట్టించుకుని మనసారా ఆరగిస్తారు. మరి పట్టణాలలో పరిస్థితి ఏంటి. అక్కడికి కూడా వచ్చేస్తున్నాయి తాటి ముంజలు. రెండు నెలల పాటు వేసవి రాజ్యాన్ని ఏలే తాటి ముంజలకు ఎప్పుడూ గిరాకీనే. ఇప్పుడు పల్లెలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు ఎక్కడైనా తాటి ముంజలు దర్శనమిస్తూనే ఉంటాయి. గీత కార్మికులు తమ కుల వృత్తిలో భాగంగా తాటి ముంజల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. రెండు నెలల పాటు మిగతా పనులను పక్కనపెట్టి తాటి ముంజల విక్రయాలు చేస్తున్నారు. పల్లెల్లో రూ.50లకు 16 తాటి ముంజల వరకు విక్రయిస్తుండగా.. మండల కేంద్రాల్లో డిమాండ్‌ను బట్టి డజను రూ.50కు విక్రయిస్తున్నారు. ఇలా రెండు నెలల పాటు గీత కార్మికులకు మంచి ఉపాధి లభిస్తోంది.

ప్రయోజనాలివే..

తాటి ముంజలు తినడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా వేసవి తాపం నుంచి సేద తీరేందుకు, శరీరం చలువ చేసేందుకు ఎంతగానో దోహదపడతాయి.

- రక్తంలో చక్కెర పెరుగుదలను నిరోధిస్తుంది. మధుమేహం ఉన్నవారు తాటి ముంజలు తింటే కొంతవరకు ఉపశమనం కలుగుతుంది.
- వీటిలో కేలరీలు తక్కువగా ఉన్నప్పటికీ కాల్షియం, ఫెటోన్యూట్రియెంట్లు విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- విటమిన్ ఏ, సీ, బీ7 లభిస్తాయి. కేలరీలు పెరగకుండానే రోగనిరోధక శక్తిని పెంచుతాయి.
- యాంటీ ఇన్ఫలమేటరీ, యాంటీ ఆక్సిడెంట్లు లక్షణాలతో పాటు ఫైటో న్యూట్రియెంట్లు, ఫ్రీరాడికల్స్‌తో పోరాడేందుకు దోహదపడతాయి.
- దద్దుర్లు వంటి చర్మ సమస్యలకు పరిష్కారమే కాకుండా ముఖంలో కాంతి పెరిగి వృద్ధాప్య ఛాయలను దూరం చేస్తాయి.
- ముఖంపై మచ్చలు, మొటిమలు, ముడతలు రాకుండా కాపాడతాయి.

22 ఏళ్లుగా ఇదే వ్యాపారం



తాటి ముంజలే నా కుటుంబానికి కూడుపెట్టాయి. నేను 22 ఏళ్లుగా ఈ వ్యాపారం చేస్తున్నాను. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూనే రెండు నెలల పాటు ఈ వ్యాపారం చేస్తాను. పొలాల్లో తాటిచెట్లు ఎక్కి కాయలు కొట్టి వాటిని ఆటోలో వేసుకొస్తాను. ఆటోకు రానుపోను రూ.500లు, నాకు సహాయపడే వ్యక్తికి రూ.500లు పోగా రూ.వెయ్యి వరకు మిగులుతుంది. ఎండలు గట్టిగా ఉంటే వ్యాపారం బాగుంటుంది. ఎపుడైనా వర్షం వస్తే ఆ రోజు వ్యాపారం పోయినట్టే.

– విత్తనాల రామకృష్ణ, గీత కార్మికుడు

తాటి ముంజలంటే భలే ఇష్టం



వేసవి వస్తే తాటి ముంజలకు భలే క్రేజ్ ఉంటుంది. మా స్నేహితులంతా కలిసి పొలాలకు వెళ్లి తాటి కాయలు కొట్టించుకుని తింటాం. రెండు, మూడు చెట్ల కాయలు కడుపునిండా తినేస్తాం. ప్రస్తుతం ఎక్కడపడితే అక్కడే తాటి ముంజలు దొరుకుతున్నాయి. డజను రూ.50లకు విక్రయిస్తున్నారు.

– కె.గోపాలకృష్ణ, రామన్నపాలెం

ఆరోగ్యానికి మేలు చేస్తాయి..



వేసవిలో వడదెబ్బ నుంచి తాటి ముంజలు కాపాడుతాయి. గతంలో పొలాలకు వెళ్లి తాటికాయలు కొట్టుకుని తినేవాళ్లం. ఇప్పుడు ఎక్కడికక్కడే తాటి ముంజలు దొరుకుతున్నాయి. ధర ఎక్కువైనా ఈ కాలంలో వీటిని తినాల్సిందే. అన్ని వయస్సుల వారికీ తాటి ముంజలు మేలు చేస్తాయి.

– పైల నాని, కె.వెంకటాపురం

యానాద్రి కాలువ ఆధునికీకరణకు శ్రీకారం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.73 కోట్లతో ఆధునికీకరించిన రైల్వేస్టేషన్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, అధికారులు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలో ప్రధాన సమస్యగా ఉన్న యానాద్రి కాలువ ఆధునికీకరణ, పూడికతీత పనులకు సుందరపు విజయ్‌కుమార్ బుధవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. రూ.2.73 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు. మొత్తం 900 మీటర్ల పొడవున 11, 12 వార్డుల్లో విస్తరించి ఉన్న ఈ కాలువలో పూడిక తీయడం, నిర్మించనున్నారు. అలాగే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు రూ.2.23 కోట్లతో చేపట్టిన రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి కావడంతో ఎమ్మెల్యే ప్రారంభించారు. అదనంగా రూ.33 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, వీఎంఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా యలమంచిలి పట్టణం, పరిసర ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. మిలిటరీ కాలనీ, కొత్తపేట, యానాద్రి కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, ప్రధాన రహదారి, ద్వారకానగర్, నెహ్రూనగర్, గాంధీనగర్, తులసీనగర్, ఎన్టీఆర్ కాలనీ, జగనన్న కాలనీ, ఫైర్ ఆఫీస్ కాలనీ, ధర్మవరం, జలాల్ వీధి, ఎర్రవరం, కొత్త ఎర్రవరం, లైను కొత్తూరు, సోమన్నపాలెం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

- 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు
- 15 రైతు సేవా కేంద్రాల్లో పంపిణీకి సిద్ధం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న వ్యవసాయ అధికారులు



ఏపీ సీడ్స్ జిల్లా గోదాముల్లో పచ్చిరొట్ట విత్తనాలకు డిమాండ్ ఇస్తున్న ఏవో రంగాచారి



ఖరీఫ్ సాగు కోసం పొలాల్లో పూర్తి చేసిన దుక్కులు

అధిక దిగుబడులు సాధించాలన్న ఆత్రుతతో అన్నదాతలు విచ్చలవిడిగా రసాయనాలు, ఎరువులు వాడేస్తున్నారు. పర్యవసానంగా ఆహార పంటలు కలుషితమవుతున్నాయి. భూసారం దెబ్బతింటోంది. క్రమంగా పంటల్లో సూక్ష్మ పోషకాలు లోపిస్తున్నాయి. చీడపీడల ఉధృతి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో రసాయనాలు, ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

తుమ్మపాల: ప్రస్తుత వ్యవసాయంలో ఎరువులు, పురుగు మందులు వాడకం ఎక్కువ కావడంతో భూసారం మరింత క్షీణతకు గురవుతోంది. పంటకు అవసరమైన పోషకాలు అందించేందుకు 80 శాతం మంది రైతులు రసాయన ఎరువులపైనే ఆధారపడుతున్నారు. వీటితో దిగుబడి ఆశాజనకంగా ఉంటున్నా, భూమి సారాన్ని కోల్పోతోంది. పంటల్లో పురుగులు, తెగుళ్ల బారిన పడేందుకు అవకాశాలే ఎక్కువ. దీంతో రైతులకు సాగు ఖర్చు పెరగడంతో పాటు గాలి, నీరు, భూమి, పంట ఉత్పత్తులు రసాయనాల బారిన పడుతున్నాయి. ఈ దశలో వ్యవసాయంలో పచ్చిరొట్ట పైర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పచ్చిరొట్ట విత్తనాలను పంట భూముల్లో ముందుగా కలియ దున్నడం వల్ల భూసారాన్ని పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి విత్తనాలను ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందిస్తోంది. కాని మండలంలో వీటి వినియోగంపై రైతులకు అవగాహన లేక అతి తక్కువ స్థాయిలో వినియోగిస్తున్నారు.

పుష్కలంగా పోషకాలు ..

వరి, ఆరుతడి, బోర్ల కింద సాగుచేసే భూముల్లో జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు వేస్తారు. నారు పోసి పొలం దున్నే సమయానికి అంటే 50–60 రోజుల్లో పంట పూతకు వస్తుంది. ఆ సమయంలో పొలంలో కలియ దున్నడం వల్ల వరి పంట కు కావాల్సిన ముఖ్య పోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్, సూక్ష్మ పోషకాలు, జింక్, బోరాన్, ఇనుము, మాంగనీస్ వంటివి పుష్కలంగా అందుతాయి. భూమిలో కర్బన శాతం తగ్గి, నత్రజని శాతం పెరుగుతుంది. కొద్దిమొత్తంలో రసాయన ఎరువుల వేసినా పంటకు ఉపయోగపడేలా చేస్తా యి. నీటి ఎద్దడి ఏర్పడినా తట్టుకునే శక్తి పెరుగుతుంది. పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవుల సంఖ్య పెరగడమే కాకుండా పురుగులు, తెగుళ్ల బెడద ఉండదు.

సాగులో పాటించాల్సిన మెలకువలు..

- పంట కోయగానే నేలలో తేమను సద్వినియోగం చేసుకుని పచ్చిరొట్ట ఎరువులు విత్తుకోవాలి.
- తేమ చాలని ప్రాంతాల్లో వేసవిలో దుక్కి దున్ని తొలకరి వర్షాలు పడగానే విత్తుకోవాలి.
- నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభదాయకం
- వరి పొలాల్లో పచ్చిరొట్ట పెంచి పూత సమయంలో కలియ దున్నాలి.

అందుబాటులో విత్తనాలు..

మండల పరిధిలో ఈ ఏడాది 15 రైతు సేవా కేంద్రాలు ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసేందుకు వ్యవసాయ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ముందుగా రైతులు ఆధార్ కార్డులు తీసుకుని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకుని వారికి కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలను ఆర్డర్ చేసుకోవాలి. అయితే మండలంలో అనేక గ్రామాల రైతులకు వీటిపై అవగాహన లేక భూముల్లో ముందుగా వేసేందుకు ముందుకు రావడం లేదు. వర్షాలు పడటంతో పొలాల్లో దుక్కులు చేస్తున్నప్పటికీ ఖరీఫ్ సాగు వరకు ఖాళీగానే ఉంచుతున్నారు. దీంతో మళ్లీ కలుపు పెరిగి దుమ్ములకు షరామామూలుగా పొలాలు తయారవుతున్నాయి. రైతులకు పూర్తి అవగాహన చేసినట్లయితే పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లి ఖరీఫ్ నాటికి పొలాలను సిద్ధంగా ఉంచుతారు. దీంతో పొలాలు సారవంతంగా తయారయ్యి ఖరీఫ్‌లో మంచి దిగుబడులు వస్తాయి. మండలంలో 2,500 హెక్టార్ల మేర ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఉన్నప్పటికీ కేవలం 16 క్వింటాళ్ల వరకే డిమాండ్ ఉండటంతో వ్యవసాయ అధికారులు ఇప్పటికే ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ (సీడ్స్)కు డిమాండ్ పెట్టినట్లు తెలిపారు. ఈ నెలలో పచ్చిరొట్ట విత్తనాలు రానున్నాయని తెలిపారు.

‘పది’లో మెరిసిన విద్యార్థులకు సన్మానం



పతిభ చూపిన విద్యార్థులను సన్మానిస్తున్న మంత్రి అనిత

నక్కపల్లి: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం ఘనంగా సన్మానించారు. నక్కపల్లిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విద్యాకుసుమాల అభినందన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో సత్తా చాటిన 101 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.5000 చొప్పున నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని కొనియాడారు. విద్యార్థుల విజయంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో 50 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి



తల్లులకు పాదాభివందనం చేస్తున్న పిల్లలు

మునగపాక: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని సత్యసాయి భజన మండలి కన్వీనర్ సరిసా శివగణేష్ కోరారు. మండలంలోని తిమ్మరాజుపేట సత్యసాయిబాబా ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఈశ్వరాంబ డే సందర్భంగా తల్లులకు పాదాభివందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు సన్మార్గంలో నడవాలన్నారు. తల్లిదండ్రులపై ప్రేమానురాగాలు చూపించడంతో పాటు కష్టపడి చదువుకోవాలన్నారు. సత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం



రీసర్వే పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

ఎస్.రాయవరం: రీసర్వేతో రైతులు తమ భూసమస్యలు పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ జె.రమేష్ బాబు అన్నారు. వమ్మవరం గ్రామంలో శరవేగంగా జరుగుతున్న రీసర్వే పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రీసర్వేతో హద్దులు సరిచేసుకుని సాగుకు ఆటంకాలు లేకుండా చేసుకోవచ్చునని చెప్పారు. హద్దులు పక్కాగా నిర్ణయిస్తూ సర్వే పూర్తి చేసి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో రీసర్వే పూర్తయితే రైతులు భూసమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ మూర్తి, పలువురు వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ప్యానల్ లాయర్ నూకరాజు

ఎస్.రాయవరం: పరిశ్రమల యాజమాన్యాలు విధిగా కార్మిక చట్టాలు అమలు చేయాలని యలమంచిలి కోర్టు ప్యానల్ లాయర్ తుమ్మపాల నూకరాజు డిమాండ్ చేశారు. రామయ్యపట్నం గ్రామంలో నిర్వహిస్తున్న కోళ్ల ఫారాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న కార్మికులకు లేబర్ చట్టాలపై అవగాహన కల్పించారు. పరిశ్రమ యాజమాన్యం అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి సంతోషి, వీఆర్వో సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



బుచ్చింపెట పీహెచ్‌సీ వద్ద నల్లబాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్య సబ్ స్టాఫ్ నిరసన

రోలుగుంట : బుచ్చింపేట పీహెచ్‌సీ వద్ద సోమ, మంగళవారాలు పీహెచ్‌సీ పరిధిలో గల సబ్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సబ్ స్టాఫ్ ఎం.ఎల్.హెచ్.పి (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్) తమను విమర్శిస్తున్న వైఖరిపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎం.ఎల్.హెచ్.పీల్లో తమపై ఉన్న చులకన భావన విడనాడాలని, రోగులకు సేవలందించడమే అందరి కర్తవ్యమని, తమపై పెత్తనం చేస్తూ తీవ్ర పదజాలంతో చేస్తున్న కించపరచే విధానం మార్చుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం స్థానిక వైద్యులను కలసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఇక్కడ ఈ పీహెచ్‌సీ పరిధిలో గల సబ్ సెంటర్లలో పని చేస్తున్న సబ్ స్టాఫ్ పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



అమ్మవారి కొలువు సంబరం



ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి మంగళవారం భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారి నెల రోజుల పండగ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల తాకిడితో పండగ వాతావరణం నెలకొంది.ఆలయ కమిటీ క్యూలైన్‌తో పాటు ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడంతో భక్తులు అమ్మవారిని ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా దర్శించుకున్నారు.

మోదకొండమ్మ కొలువు ప్రారంభం

మోదకొండమ్మ కొలువు ఉత్సవం ఆలయ కమిటీతో పాటు గ్రామస్తులు ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి మోదకొండమ్మ సతకం పట్టు వద్దకు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని కాలి నడక డప్పులు వాయిద్యాలు నడుమ సతకం పట్టు వద్దకు చేరుకున్నారు. జూన్ 3 వ తేదీ వరకు అక్కడే కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ

మునగపాక: ఒంపోలులో మంగళవారం పైడితల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే విజయకుమార్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.